క్లుప్తంగా

నేడు నూకాలమ్మ పూల గరగ ఉత్సవం



అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవానికి సిద్ధంగా ఉంచిన పూల గరగ

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మండలం కాండ్రకోట నూకాలమ్మవారి పూల గరగ ఉత్సవం ఈ నెల 16న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ గరగ ఉత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం అమ్మవారి ఆలయం పూల గరగ ఉత్సవాన్ని ఉదయం 11.20 గంటలకు వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయం నుంచి గరగను తీసుకుని డప్పు వాయిద్యాలు, భారీ బ్యాండ్ మేళం మధ్య గరగను ఊరేగిస్తారన్నారు.

మహారాణి కళాశాలలో అడ్మిషన్లు పెంచాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూరిబాబు రాజు తదితరులు

పెద్దాపురం: ప్రసిద్ధ ఎయిడెడ్ కళాశాలగా పేరొందిన పెద్దాపురం మహారాణి కళాశాలలో అడ్మిషన్లు పెంచేందుకు కృషి చెయ్యాలని పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు కోరారు. స్థానిక కళాశాల ఆవరణలో శనివారం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి అధ్యక్షతన నూతన అడ్మిషన్లకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూరిబాబు రాజు మాట్లాడుతూ 58 ఏళ్ల చరిత్ర కల్గిన మహారాణి కళాశాల ప్రాముఖ్యతను ప్రస్తుత విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు మరింతగా పెరిగేందుకు పూర్వ విద్యార్థులు సహకరించాలన్నారు. ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 7వ తేదీ నుంచి అడ్మిషన్లు స్వీకరిస్తామన్నారు. ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా తక్కువ ఫీజుతో అడ్మిషన్లు ఇస్తున్నట్టు తెలిపారు. జూన్ 1వ తేదీకి బదులుగా ఏప్రిల్ 1 నుంచే ఎయిడెడ్ ప్రభుత్వ కళాశాలలు ప్రారంభమవుతాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కరస్పాండెంట్ జాస్తి రమేష్, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు ముస్తాఫా, కేఎస్‌ఆర్‌కే చౌదరి, కళాశాల పాలకవర్గ సభ్యులు రాయి ప్రభాకరరావు, తాళ్లూరి శేఖర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ సంవత్సరం పరీక్షలు

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ విద్యాసంస్థల కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ కె.సతీష్‌కన్నా తెలిపారు. మొత్తం 186 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 183 మంది హాజరయ్యారని తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగిసాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

పురుగులపై పాశుపతాస్త్రం

- పంటలకు సంజీవినిగా తూటికాడ కషాయం
- ప్రకృతి వ్యవసాయంలో తూటికాడకు ప్రాధాన్యత
- ప్రకృతి సేద్యంలో కొత్త ఒరవడి



సేకరించిన తూటికాడను కషాయం తయారీకి సిద్ధం చేస్తున్న రైతులు



తూటికాడ కషాయం తయారు చేస్తున్న రైతులు



తూటికాడ కషాయం పిచికారీ చేసిన వరి పొలం

పిఠాపురం: కాలువలు, చెరువుల్లో ఏపుగా పెరిగి కనిపించే తూటికాడ ఒకప్పుడు ఎందుకూ పనికి రానిది. పంటలకు సాగునీరు అందకుండా చేసే అవరోధంగా తూటికాడ ఉండేది. దానిని తొలగించడానికి రైతులు ఎంతో వ్యయప్రయాశలకు గురికావాల్సి వచ్చేది. దానిని అడ్డు తొలగించుకోవాలని చూడడం తప్ప ఎన్నడూ తూటికాడ ఉపయోగాలపై ఆలోచించిన పరిస్థితుల్లేవు. అలాంటి తూటికాడ ఇప్పుడు ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఉపయోగపడుతూ పంటలకు ఒక సంజీవినిగా మారింది. పంటలను కాపాడే విద్య ఔషధంగా ఉపయోగపడుతూ రైతులకు పంటల సాగులో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందే అవకాశాలు కల్పించింది.

సుడిదోమ నిర్మూలనకు దోహదం

ప్రకృతి వ్యవసాయంలో పనికి రాని ఆకు అలము అనేది ఉండదనేది నిజం. ఎందుకూ పనికి రానిదిగా భావించే తూటికాడ ఇప్పుడు రైతులకు వరంగా మారి ప్రకృతి వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తోంది. వరి పంటకు ఎంతో కీడు చేసి, రైతులకు తీవ్ర నష్టాలు కలిగించే సుడిదోమ పాలిట పాశుపతాస్త్రంగా తూటికాడ కషాయం పని చేస్తోంది. రసాయనాలకు ధీటుగా పనిచేస్తున్న దీనిని ఉపయోగించుకుని రైతులు తమ పంటలను పురుగులు, తెగుళ్ల బారి నుంచి కాపాడుకుంటున్నారు. గతంలో అడ్డుగా ఉండే తూటికాడను తీయించడానికి రైతులు కూలీలను పెట్టే పరిస్థితి నుంచి రైతులే తూటికాడను తీసుకుని వాడుకునే పరిస్థితులు వచ్చాయి. దీంతో రైతులకు సాగునీటి ఆటంకాలు తగ్గడంతో పాటు పంటలకు మేలు జరుగుతోంది.

తూటికాడ కషాయం తయారీ విధానం

పనికిరాదనుకునే ఆకులతో అద్భుత ద్రావణం తయారవుతోంది. తూటికాడ ఆకులు 10 కేజీలు, ఆవు మూత్రం పది లీటర్లు తీసుకోవాలి. తూటికాడల్లో ఎటువంటి కాడలు లేకుండా కేవలం ఆకులు మాత్రమే 10 కేజీలు తీసుకోవాలి. ఒక పొయ్యిపై బాన పెట్టి దానిలో ఆవు మూత్రం వేసి దానిలో తూటికాడ ఆకులు వేసి బాగా మరిగించుకోవాలి. ఐదు పొంగులు వచ్చే వరకు బాగా మరగబెట్టాలి. మరగబెట్టిన తరువాత చివరకు 7 లీటర్ల కషాయం తయారవుతుంది. అలా వచ్చిన మిశ్రమాన్ని వడగట్టి 100 లీటర్ల నీటికి ఒక లీటరు ద్రావణం కలిపి పిచికారీ చేసుకుంటే రసం పీల్చు పురుగులు, లద్దె పురుగులు, సుడి దోమలను ఈ కషాయం సమర్థవంతంగా అరికడుతుంది. అయితే ఏరోజుకు ఆరోజు తయారు చేసుకుని పిచికారీ చేసుకోవాల్సి ఉంటుంది. తెగులు రాకుండానే దీనిని పిచికారీ చేసుకోవడం వల్ల ఎటువంటి చీడపీడలు పంటలకు సోకకుండా ముందే అరికట్టవచ్చని రైతులు అంటున్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు. కేవలం ప్రకృతిలో లభించే తూటికాడ కషాయం వల్ల ఎకరానికి రూ.2వేల వరకు పురుగు మందులకు అయ్యే ఖర్చు 100 శాతం తగ్గించుకోవచ్చు. ఇది చాలా విషపూరితం కావడంతో పిచికారీ చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు ఖచ్చితంగా పాటించాలి.

తూటికాడ కషాయం ప్రభావవంతమైనది

ఇద్దరు రైతులం కలిసి 23 ఎకరాలు వరి సాగు చేసాం. ప్రస్తుతం వరి పంటపై సుడిదోమ, ఎండుతెగులు తీవ్రంగా విజృంభించి తీవ్ర నష్టం కలిగిస్తోంది. ఇంతలో మా గ్రామానికి వచ్చిన ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది గుండ్ర శివచక్రం మాకు తూటికాడ కషాయం పనితీరును వివరించారు. మా పొలాల్లో పిచికారీ చేసేందుకు కషాయం కావాలని అడిగితే ఎలా తయారు చేసుకోవాలో చెప్పారు. మా పొలాల్లో కాలువల దగ్గర దొరికే తూటికాడ మా గ్రామంలో పశువుల కొట్టంలో లభించే ఆవు మూత్రం సేకరించి మా పొలంలోనే తూటికాడ కషాయం తయారు చేసి పైరుపై పిచికారీ చేసాం. అద్భుతంగా పని చేసింది. 23 ఎకరాల వరిపైరుపై సుడిదోమ నివారణకు కనీసం రూ.40 వేలు ఖర్చు చేసి పురుగు మందులు కొనాల్సి వచ్చేది. తూటికాడ కషాయం సొంతంగా తయారు చేసుకోవడం వల్ల ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదు. రూ 40 వేల వరకు ఖర్చు మిగిలింది. తూటికాడ పనితనం చూసి ఆశ్చర్యం వేసింది. ఇలా మన పరిసరాల్లోనే దొరికే వాటితోనే కషాయాలు తయారు చేసి పంటలపై వినియోగించుకోవడం ద్వారా రసాయన పురుగు మందులకు స్వస్తి పలికి ఆరోగ్యవంతమైన పంటలను పండించుకోవచ్చు.

– గవరసాని చంటిబాబు, తుమ్మలపల్లి సత్తిబాబు రైతులు, చేబ్రోలు

ప్రకృతి వరంగా తూటికాడ

తూటికాడ ఒకప్పుడు రైతులకు శత్రువుగా చూసేవారు కాని అది ఇప్పుడు మిత్రుడుగా మారింది. ప్రతీ ఏటా రైతుకు బారంగా మారిన తూటికాడ ఇప్పుడు రైతుకు పకృతి ఇచ్చిన వరంగా మారింది. ఎక్కడ పడితే అక్కడ దొరికే తూటికాడ అనేక రకాల పురుగులు తెగుళ్లను అరికట్టడంలో కీలకపాత్ర వమిస్తోంది. అందుకే దాని విలువను గుర్తించి ఆవిషయాన్ని రైతులకు వివరించాం. అది తెలుసుకున్న రైతులు తూటికాడ కషాయం తయారు చేసుకుని మంచి ఫలితాలు సాదించారు. ఒక్క కాకినాడ జిల్లాలోనే వివిద గ్రామాల్లో సేంద్రీయ పంటలు పండించే రైతులతో పాటు ఇతర రైతులు ప్రతీ రోజు సుమారు 5వేల లీటర్ల కషాయం తయారు చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం వరి పంటకు తీవ్ర నష్టం కలిగించే సుడిదోమ 100 శాతం నివారించబడుతోంది. ఎకరానికి రూ 2వేల ఖర్చు రైతులకు మిగులుతోంది. అందుకే రైతులు అందరు దీనిని తయారు చేసుకుని వాడుకోడానికి ముందుకు వస్తున్నారు.

– ఎలియాజరు, ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం, కాకినాడ

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు



కల్వర్టును నీటితో తడుపుతున్న కౌన్సిలర్ నేతల హరిబాబు

సామర్లకోట: అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఆయా నిర్మాణాలు వేగంగా శిథిలమవుతాయని కౌన్సిలర్ నేతల హరిబాబు అన్నారు. స్థానిక బలుసులపేట తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ వద్ద నూతన కల్వర్టు నిర్మించి, దీనిని పటిష్ట పరిచేందుకు నీటితో తడపడం లేదని స్థానిక కౌన్సిలర్ హరిబాబు ఆరోపించారు. కల్వర్టు నాణ్యతగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఆయన స్వయంగా వాటరింగ్ పనులు నిర్వహిస్తున్నారు. కొన్నేళ్లుగా ఇక్కడి కల్వర్టు శిథిలమైనా ఎవరూ పట్టించుకోలేదని ఆయన అన్నారు. ప్రజల అభ్యర్థన మేరకు కౌన్సిల్ నిధులు కేటాయించి టెండర్లు ఖరారు చేసినా కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించలేదు. దీనిపై ‘సాక్షి’లో వచ్చిన కథనంతో ఇంజనీరింగ్ శాఖ అధికారులు స్పందించి కాంట్రాక్టరును పిలిచి కల్వర్టు పనులు పూర్తి చేయించారు. మూడు రోడ్ల కూడలి ప్రదేశంలో ఉన్న ఈ కల్వర్టు మీదుగా ప్రతి రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయని, ఈ నిర్మాణాన్ని పటిష్ట పరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని హరిబాబు కోరారు.

నేడు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం

సామర్లకోట: స్థానిక మండల ప్రజాపరిషత్తు సర్వసభ్య సమావేశం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న సమస్యలను చర్చించడానికి ఆయా శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలన్నారు. ఈ సమావేశానికి ఆర్‌అండ్‌బీ అధికారులు హాజరయ్యేలా ఆదేశాలివ్వాలని ఎంపీపీ మండల పరిషత్తు అధికారులకు సూచించారు. ఈ సమావేశానికి అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

స్వచ్ఛ భారత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలి



పెద్దాపురం ఎంపీడీఓ కార్యాలయం స్వచ్ఛభారత్ పనులు చేపడుతున్న సిబ్బంది



వీకే రాయపురంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ విద్యార్థులు, ఉపాధ్యాయుల ర్యాలీ

పెద్దాపురం: స్వచ్ఛ భారత్‌కు ప్రజలు ప్రతి ఒక్కరూ సహకరించాలని పెద్దాపురం ఎంపీడీఓ శ్రీలలిత అన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కార్యాలయంలో ఎంపీడీఓ సిబ్బందితో కలిసి చీపురు పట్టారు పెద్దాపురం పురపాలక సంఘం మేనేజర్ జ్యోతిరాణి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించగలమన్నారు. పుర ప్రజలు ప్రతీ ఒక్కరూ తడి, పొడి చెత్తలను విడివిడిగా డస్ట్‌బిన్‌ల్లో ఉంచితే పారిశుధ్య సిబ్బంది వచ్చి వాటిని తీసుకువెళతారన్నారు. పారిశుద్య సిబ్బందికి ప్రజలు సహరించాలన్నారు. అనంతరం పలు అంశాలపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి సత్యనారాయణమూర్తి, సుధాకర్, మహేష్‌తో పాటు మున్సిపల్ శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

సామర్లకోట: ప్లాస్టిక్ రహిత, ఆరోగ్యవంతమైన గ్రామాలను తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వీకే రాయపురం సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ-దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని షాపులను పరిశీలించి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల విక్రయాలను పూర్తి నిషేధించాలని వ్యాపారులకు సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు, ఆశావర్కర్లు, విద్యార్థులు, పంచాయతీ, సచివాలయ సిబ్బందితో కలసి గ్రామంలో ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుర్రా నారాయణస్వామి, రైతు సంఘ నాయకుడు గొల్లపల్లి నానాజీ పాల్గొన్నారు.

మార్కెట్‌లో డ్రెయిన్ల సమస్యను పరిష్కరించండి

సామర్లకోట: స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపు నిచ్చారు. ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక కూరగాయల మార్కెట్‌లో మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూరగాయలు, చేపల వ్యాపారులు డ్రెయిన్ల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. కమిషనర్‌తో కలసి ఎమ్మెల్యే కూరగాయలు, చేపల మార్కెట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చిట్టుమాని రాఘవ, పితాని కృష్ణ, బలుసు వాసు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి పాల్గొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. స్థానికులకు క్లాత్ కవర్లను ఎమ్మెల్యేకు అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

సామర్లకోట: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంటుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి అనేక నష్టాలు కలుగుతున్నాయని తెలిసినా నిత్యం ప్లాస్టిక్‌తోనే జీవనం సాగిస్తున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అనేక మంది వేడి టీని ప్లాస్టిక్ కవర్లతో తీసుకొని వెళుతున్నారని, అది ఎంత ప్రమాదమో తెలుసుకోవాలన్నారు. బయట తిరిగి వచ్చిన తరువాత చేతులు శుభ్రం చేసుకునే అలవాటును ఆచరించాలన్నారు. ఈ మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏఎల్‌వీ కుమారి, జి. గోవిందు, కేవీవీ సత్యనారాయణ, కె శ్రీనివాసు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ఎస్పీ దంపతుల పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో శనివారం జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన వారికి పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు, సీఐ ఎ.కృష్ణభగవాన్, ఈఓ బళ్ల నీలకంఠం స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలోని కాలబైరవస్వామి, ధ్వజ స్తంభాన్ని దర్శించుకొని ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగానికి ఆయన స్వయంగా నీటితో అభిషేకం చేశారు. ఆలయంలోని పెద్ద నంది, మూలవిరాట్, ఉప ఆలయాలను దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి, అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. నంది మండపం వద్ద ఆలయ పండితులు ఎస్పీ దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈఓ బళ్ల నీలకంఠం స్వామి ప్రసాదం, ఫొటోను అందజేసి పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహాశివరాత్రి సందర్భంగా ఉత్సవాల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా చేసిన స్థానిక పోలీసు అధికారులు, ఆలయ ఈఓ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, పెద్దాపురం ఎస్సై మౌనిక, ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, ఆలయ పండితులు పాల్గొన్నారు.

‘సౌందర్య శిఖరం-అమ్మ’ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

బాలాజీచెరువు: నగరానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు పీసపాటి చంద్రశేఖర్ రచించిన ‘సౌందర్య శిఖరం- అమ్మ’ పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం స్థానిక ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ అమ్మ ఔన్నత్యాన్ని తెలుపుతూ ఈ పుస్తకాన్ని చంద్రశేఖర్ అద్భుతంగా రచించారన్నారు. సినీ దర్శకుడు వంశీ మాట్లాడుతూ అమ్మ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాలని కోరారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు, వంగా గీత మాట్లాడుతూ అమ్మను ప్రేమించేవారందరూ ఈ పుస్తకం చదవాలని, అన్ని వర్గాలకు చేరవయ్యే రీతిలో రచయిత పుస్తకం రచించారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు వైడీ రామారావు, గొడవర్తి సత్యమూర్తి, ర్యాలీ ప్రసాద్, కొండూరి రామరాజు, దేవినేని రమణ, చిరంజీవి వర్మ పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల అసహనం

- మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారుల డుమ్మా
- వైద్యాధికారిని నిలదీసిన ఎంపీడీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో స్వప్న

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికైన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి బాధ్యత గల అధికారులు హాజరుకాకుంటే ఎలా అని పలువురు ఎంపీటీసీ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు మండల పరిషత్ సమావేశం శనివారం మండల పరిషత్ ఎంపీపీ అరిగెల అచ్చియమ్మ అధ్యక్షతన నిర్వహించారు. మండల పరిషత్ సమావేశానికి పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. వైద్యశాఖాధికారులు ఎవరూ హాజరు కాకపోవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేసారు. ఇంతలో చేబ్రోలు హెల్త్ సూపర్‌వైజర్ రమణమూర్తి హాజరుకాగా డాక్టర్లు ఏమయ్యారని ఎంపీడీవో స్వప్న ప్రశ్నించారు. డాక్టర్లు హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. దీనిపై హెల్త్ సూపర్‌వైజర్ రమణమూర్తి మాట్లాడుతూ ఒక డాక్టర్ 104 డ్యూటీ ఉందని, మరో డాక్టర్‌కు ఓపీ డ్యూటీ ఉందని చెప్పడంతో మండల సమావేశం జరిగేటప్పుడు డాక్టర్లు హాజరు కాకపోతే సభ్యులకు ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు ఎలా తెలుస్తాయని ఎంపీడీవో ప్రశ్నించారు.

ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తల సేవలు అంతంతమాత్రమే

చందుర్తి ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ బత్తిన మంగ మాట్లాడుతూ గర్భిణులను డెలివరీలకు తీసుకెళ్లడానికి ఏఎన్‌ఎంలు ఎవరూ సహకరించడం లేదని, ప్రతి నెల ఆసుపత్రికి వారిని తీసుకెళ్లడం లేదని ఆరోపించారు. ఆశా కార్యకర్తల సేవలు కూడా అంతంత మాత్రంగానే ఉంటున్నాయని తెలిపారు. దీనిపై హెల్త్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఆశా కార్యకర్తలకు రాజకీయ నాయకుల మద్దతు ఉండడంతో వాళ్లపై ఏ విధమైన చర్యలు తీసుకోలేకపోతున్నామని అన్నారు. ఎంపీడీవో స్వప్న కలగజేసుకుని సర్వేల కోసమని సచివాలయ సిబ్బందితోపాటు ఆశా కార్యకర్తలను కూడా వినియోగించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ సర్వేలు చేస్తున్నామంటూ తప్పించుకుంటున్నారన్నారు. ఇప్పుడు ప్రజాప్రతినిధులు కూడా వారి పనితీరు బాగోలేదని, సేవలు సక్రమంగా అందడం లేదని చేబ్రోలు పీహెచ్‌సీ అధికారికి ఈ విషయం చెప్పాలంటే అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టిలో పెట్టి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో అన్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి సంబంధిత శాఖలకు సంబంధించిన అధికారులు సమావేశాలకు రావడం లేదని అన్నారు. దీనిపై కలెక్టర్‌కు లేఖ రాస్తామని తెలిపారు. అంతకుముందు వ్యవసాయ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ రైతు విశిష్ట నంబరు చేయించుకోవాల్సిన వారు ఇంకా మండల పరిధిలో 4వేల మంది ఉన్నారని, వారికి మార్చి 25వ తేదీ వరకూ మాత్రమే గడువు ఉందని తెలిపారు. ఈ క్రాప్ నమోదు 70 హెక్టార్లు పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఎంపీపీ అరిగెల అచ్చయ్యమ్మ మాట్లాడుతూ వచ్చే వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని పారిశుద్యంపై దృష్టి సారించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణు మాట్లాడుతూ వేసవిలో తాగునీటి అవసరాల కోసం ప్రతి పంచాయతీ తగిన నిధులను అందుబాటులో ఉంచుకోవాలని, వేసవి తాగునీటి ఎద్దడి నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అంగన్‌వాడీ సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని సూపర్‌వైజర్లు ముందుగా సమాచారం ఇచ్చి కేంద్రాలను తనిఖీ చేస్తున్నారని ప్రత్యేక ఆహ్వానితులు రామయ్య దొర, వైస్ ఎంపీపీ మంగ అన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది కేంద్రాలను తెరిచి వాళ్ల సొంత పనులపై వెళ్లిపోతున్నారని ఫిర్యాదు చేస్తే దీనికి సంబంధించిన సమాచారం అంగన్‌వాడీలకు అందజేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అధివిష్ణు, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన దివ్య కల్యాణ మహోత్సవాలు

కొత్తపల్లి: మూలపేటలో వేంచేసియున్న బలభద్ర సుభద్ర సమేత జగన్నాథస్వామి, దేవి భూదేవి సమేత సత్యనారాయణస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు శనివారం రాత్రి శ్రీ పుష్పయాగంతో ముగిసాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి



వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న మోహన్

పెద్దాపురం: వినియోగదారుల చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ వి.మోహన్ అన్నారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్లో వినియోగదారుల సంఘం ప్రతినిధులు, విద్యార్థులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారుల సంఘం అధ్యక్షుడు భళ్లమూడి సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలన్నారు. సినిమాహాళ్లలో మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోయినా, అసౌకర్యంగా అనిపించినా వినియోగదారుల తరుపున ప్రశ్నించవచ్చన్నారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసిన వ్యక్తికి అదనపు సొమ్ములు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కిరాణా, కూరగాయలు కొనుగోలు చేసేటప్పుడు తూకం సరిచూసుకోవాలని, వ్యత్యాసం ఉంటే వినియోగదారులు తమ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని మోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఓ విజయకుమారి, ఎం.భాస్కర్, వి.శ్యామల, హెచ్‌ఎం భరత్, ప్రతినిధులు, వినియోగదారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు



సామర్లకోట మండలం నవరలో పదో తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: మండల పరిధిలోని పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయడానికి మండలంలో 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మండల విద్యాశాఖాధికారి వై శివరామకృష్ణయ్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని నవర జిల్లా పరిషత్తు హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న అదనపు తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మాట్లాడుతూ మండల పరిధిలోని 16 ప్రభుత్వ పాఠశాలల్లో 1,035 మంది విద్యార్థులు, 16 ప్రైవేటు పాఠశాల్లోని 430 మంది, ప్రైవేటుగా పరీక్షలు రాసే విద్యార్థులు 872 మంది ఉన్నట్లు చెప్పారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో 287, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్లో 160 మంది, ప్రభుత్వ హైస్కూల్లో 196 మంది, జిల్లా పరిషత్తు హైస్కూల్లో 200, ప్రతిభా విద్యానికేతన్‌లో 285, ఉండూరు జిల్లా పరిషత్తు హైస్కూల్లో 230 మంది, వీకే రాయపురం జిల్లా పరిషత్తు హైస్కూల్లో 224, వేట్లపాలెం జిల్లా పరిషత్తు హైస్కూల్లో 271, వేట్లపాలెం బీలో 293, నవర జిల్లా పరిషత్తు హైస్కూల్లో 164 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. విద్యార్థులు పరీక్షలు రాయడానికి అవసరమైన అన్ని ఏర్పాటు పూర్తి చేశామన్నారు. 17వ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటి వరకు ఉదయం 9.30 నుంచి 12.45 వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. పరీక్షల చీఫ్ మినహా ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకు రావడానికి అనుమతి లేదని చెప్పారు. పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు హెల్త్ సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.